"రజనీ! కూర్చో! నీతో కూడా మాట్లాడాలి" అంది రుక్మిణి.

రజని మారు మాట్లాడకుండా బల్ల చివర కూర్చుంది తలవంచి.

"మురళితో మాట్లాడింది విన్నావా? ఆ శ్రీలతతో వ్యవహారం నీకు ఎలా ఉందోగానీ నేను మాత్రం భరించలేకపోతున్నాను. నీతో మాట్లాడ్డానికి రెండు నిమిషాలు కూడా శ్రద్ధ పట్టడు. ఆ మనిషికోసం ఫోను దగ్గిరే వేళ్ళాడతాడు. నువ్వు ఎంతో ముచ్చటగా పుస్తకం చదివి వినిపిస్తోంటే, అవతల మనిషి ఫోనులో పిలవ గానే నిన్ను తోసిపారేసి, ఆ మనిషితో కాలక్షేపం చేస్తాడు. అది చాలదూ నీ శరీరం దహించుకుపోడా నికి? నీ రక్తం ఉడికిపోడానికి? అంతా నీ కళ్ళ ముందే జరుగుతూ వుంటుంది. అయినా నువ్వు చూడదల్చు కోవు. నువ్వు గట్టిగా బాధపడడం నేను ఒక్కసారి కూడా చూడలేదు. ఇంత నిమ్మకి నీరెత్తినట్టు ఎందుకు ఉంటావో నాకు అర్థంకాదు.

మురళికి నీ మీద ప్రేమ పోయిందని నీకు అర్థం కావడంలేదూ రజనీ? మనసు లేని కాపరం ఎందుకని అతనికి చెప్పెయ్య రాదూ? అతని దారిన అతన్ని వెళ్ళిపొమ్మని వొదిలెయ్యరాదూ? నీకు ఇంకోదారి ఏర్పడే దాకా నీకు అండగా నేను ఉంటాను. నన్ను నమ్ము! ఇప్పుడు నీకు చాలా అనుభవం వుందికదా? ఈసారి నిన్ను నిజంగా ప్రేమించే మనిషిని ఎంచుకో! అలాంటి మనిషికోసం ఎన్ని సంవత్సరాలైనా ఎదురు చూడు! ఎవరూ దొరక్కపోతే ఒంటరిగా ఉండిపో! ఎన్నిసార్లు భరిస్తావు, ఇలాంటి అవమానాలు?

రజనీ! నీ మీద మనసులేని మనిషితో ఎందుకీ సంసారం? మురళిని ఈ బంది ఖానా నించి పంపిం చెయ్యి! అతనికి ఎవరితో ఆనందంగా ఉంటే వాళ్ళతో బతక మని చెప్పు! నీతో ఆనందం లేదుకదా? అలాంటి మనిషితో జీవితం ఎందుకు నీకు? అది నీకు అవ మానం కాదూ?

చెయ్యలేవా ఆ పని? ఎందుకు చెయ్య లేవు? మురళి చేష్టలే బాగున్నాయా నీకు? ఇలాగే భరిస్తూ ఉంటావా?

నీ జీతం కన్నా అతని జీతం ఇరవై రెట్లో పాతిక రెట్లో ఎక్కువ!

అతను నీకోసం కొనని వస్తువు లేదు. రేపోమాపో కారు కూడా తేబోతున్నాడు. రాబోయే కాలం అంతా ఇంతకన్నా సిరి సంపదలతో గడుస్తుంది.

కాకపోతే నువ్వు అతన్ని చూసీ చూడ నట్టు వొది లెయ్యాలి! వేలు సంపాదించే భర్తకదా? కంప్యూటర్ కంపెనీలో పెద్ద పదవిలో ఉన్నవాడు కదా? అతని సరదాలు అతనికి ఉంటాయి. అతని కాలక్షేపాలు అతనికి ఉంటాయి. నీ కోపతాపాలతో అతనికి కాళ్ళ బంధం కాకూడదు. ఆ వొక్క స్వేచ్ఛా అతనికి ఇచ్చేస్తే, నీ కోసం అతను ఎన్ని వస్తువులైనా కొంటాడు.

అందుకే నువ్వు ఇంత అణకువగా ఉంటున్నట్టు న్నావు.

మీ ఇద్దరితోటీ పిచ్చెత్తినట్టుగా ఉంది నాకు! ఇంకా ఎన్నాళ్ళు ఇలాగ?

ఇద్దరూ తేల్చి చెప్పండి!

ఎప్పట్లాగే మనం ముగ్గురం కలిసి ఉంటామా?

లేకపోతే, రజనీ! మనం ఇద్దరం కలిసి ఉందామా?

అదీ ఇదీ కాకపోతే నా దారిన నేను వెళ్ళిపోనా?

ఏదో ఒకటి తేల్చుకోవాలి మనం!

మీతో సర్దుకోడం నా వల్లకాదు. అదే చేతనైతే నా జీవితం ఇంకోలాగ నడిచేది. అతని భార్యల్లో ఒక భార్యగా అక్కడే పడి ఉండేదాన్ని. అది చేతకానప్పుడు, ఇవ్వాళ కొడుకు చేష్టలు చూస్తూ, కొడుకు దగ్గిర పడి ఉండడం ఎలా చేతనవుతుంది? నా వల్లకాదు."

రజని చెంపల మీద నించీ జలజలా కన్నీళ్ళు జారిపోతున్నాయి. తలవొంచి ఏడవడం మొదలు పెట్టింది.

మురళి చప్పున లేచి రజని దగ్గిర నిలబడి "ఛీఛీ! ఊరుకో! ఏం లేదు. ఊరుకో" అని తన రుమాలుతో కళ్ళు తుడిచాడు.

రజని ఇంకా ఏడుస్తోనే ఉంది.

మురళి కళ్ళల్లో కూడా నీళ్ళు తిరిగాయి.

తల్లిని భయంగా చూస్తూ అక్కడే నిలబడ్డాడు.

[15-1-1999 ఆంధ్రజ్యోతి వారపత్రికలో] ★